తొండ గ్రామంలో మాజీ సర్పంచ్ మల్లయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక

తిరుమలగిరి, మే 2 : మండలంలోని తొండ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గొలుసుల మల్లయ్య సమక్షంలో 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు.

వడదెబ్బ తో పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ కోటాచలం

కోదాడ టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కోటాచలం

కోదాడ టౌన్, మే 2 : వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో జరుగుతున్న వివిధ జాతీయ కార్యక్రమాల అమలుపై ఆరోగ్య సిబ్బంది, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ వడదెబ్బ గురించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడి గాలుల కారణంగా వడదెబ్బ, డీ హైడ్రేషన్ భారిన పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. సాధారణంగా వచ్చే వ్యాధులు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకమేనన్నారు. అలాగే ప్రత్యేక శిక్షణ తీసుకున్న సిబ్బంది పూర్తిస్థాయిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్, వ్యాధి నిరోధక టీకాల అధికారి పెండెం వెంకటరమణ, కళ్యాణ్ చక్రవర్తి, నజియా, డాక్టర్ దశరథనాయక్, డెమో అంజయ్య, కిరణ్, సతీశ్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలి

తిరుమలగిరి : రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ లాజర్ అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండే ఎండలపై ప్రజలకు అవగాహన కల్పించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే విధంగా కృషి చేయాలన్నారు. అత్యవసర పనులు ఉంటే తప్పా ఎండల్లో బయటకు వెళ్లొద్దని చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ సుధా, మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి, ఎంపీఓ మారయ్య, ఎస్ఐ సత్యనారాయణ, ఏపీఓ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

నూతనకల్ : రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధిరి ఆశ్రితరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రాల్లో రైతులకు, కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. వేసవిలో నీరు బాగా తాగాలని, కాటన్ దుస్తులు ధరించాలని ఆమె సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మునగాల, మే 2 : పదేండ్లలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా కార్మికులు, కర్షకులను వంచించిన బీజేపీకి ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటుతో గుణపాఠం చెప్పాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాంతాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న మోదీ ప్రభుత్వాన్ని ప్రజలు అడ్డుకోవాలన్నారు. ఇప్పటికే దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నట్లు దుయ్యబట్టారు. ప్రజాసామ్య వ్యవస్థను బలహీన పరిచి రాజ్యాంగాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరావు, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, వెంకట్‌రెడ్డి, కొండారెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బావిలో ఈతకు వెళ్లి బాలుడి మృతి

సూర్యాపేట రూరల్, మే 2 : బావిలో ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పిన్నాయిపాలెం గ్రామంలో గురువారం జరిగింది. ప్లాస్టిక్ బాటిల్స్ నడుముకు కట్టుకుని బావిలో తోటి పిల్లలతో ఈత కొట్టేందుకు దిగిన బాలుడు మణికంఠ (7) బాటిల్స్ మూత ఊడడంతో నీట మునిగి చనిపోయాడు. మృతదేహాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. తల్లిదండ్రులు పబ్బు సతీశ్, రేణుకను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఉన్నారు.

వర్ధమానుకోటలో రాత్రి వేళ పని చేస్తున్న గ్రామ కార్యదర్శి అంబేద్కర్, సిబ్బంది

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

నాగారం, మే 2 : మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో మూడు రోజుల క్రితం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం పక్కన ఉన్న తాగునీటి సరఫరా ఆఫ్ ఆన్‌లు విరిగిపోయాయి. దాంతో గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తక్షణం స్పందించిన గ్రామ కార్యదర్శి జలగం అంబేద్కర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ద్వారా నిధులు సమీకరించి అవసరమైన పైప్ లైన్ సామగ్రి తెప్పించాడు. రెండు రోజులు రేయింబవళ్లు దగ్గరుండి పనులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. సేవలను గుర్తించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ దారా శ్రీనివాస్ గ్రామానికి వచ్చి కార్యదర్శి, సిబ్బందిని అభినందించారు.

పదవులను అవసరాలకు వాడుకునేది కాంగ్రెస్

- ప్రజల మధ్య చిచ్చు పెట్టేది బీజేపీ
- నదీ జలాల విషయంలో జరుగుతున్న అన్యాయం సమాజానికి అర్థమైంది
- కేసీఆర్ ఉండడం అనేది చారిత్రక అవసరం
- కేంద్రంలో రాబోయే సంకీర్ణ ప్రభుత్వంలో బీఆర్ఎస్‌దే కీలక పాత్ర
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో ఇంటింటి ప్రచారం

జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, ప్రజా అవసరాలను పక్కన పెట్టి పదవులను సొంత అవసరాల కోసం వాడుకునే పార్టీ కాంగ్రెస్ అని, ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేసే పార్టీ బీజేపీ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా జగదీశ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి కరువుకే నీళ్లివ్వలేని అసమర్థ, చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్ అని మండిపడ్డారు. ఐదారేండ్లుగా రైతులకు సరిపడా నీళ్లు ఇస్తే, నాలుగు నెలల్లోనే నీటి నిర్వహణ తెలియక కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను ఎండబెట్టిందని దుయ్యబట్టారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో జరుగుతున్న అన్యాయం, మోదీ-రేవంత్ కుమ్మక్కు వ్యవహారం, తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వం అనేది చారిత్రక అవసరం అని, దానిని గుర్తించి తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 16 సీట్లు బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని, ఈ మేరకు ప్రజలు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇక కేంద్రంలో ఏ పార్టీకి సరిపడా మెజారిటీ రాదని, ఎన్నికల అనంతరం ఏర్పడబోయే సంకీర్ణ ప్రభుత్వంలో బీఆర్ఎస్ కీలక పాత్ర ఉండబోతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేయడమంటే మనల్ని మనం మోసం చేసుకోవడమేనన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని తెలిపారు. మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, నాయకులు ఆకుల లవకుశ,

మతకాల చలపతిరావు, రియాజ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

- పార్టీ నాయకులు

సూర్యాపేట రూరల్ : లక్ష్మీతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తిరుమలగిరి, మే 2 : లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ మండల నాయకులు గురువారం మండలంలోని కోక్యానాయక్‌తండాలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సతీశ్‌కుమార్, దూపటి రవీందర్, బర్ల వెంకన్న, తెడ్డు భాస్కర్, యాకూబ్ నాయక్, సురేందర్, బొడ్డు సైదులు, నర్సింహారెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి : బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అందుకోసం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ నాయకత్వంలో శుక్రవారం నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుశలవ రెడ్డి, దుర్గయ్య, పరమేశ్, సోమయ్య, సూర్యప్రకాశ్, శ్రీహరి పాల్గొన్నారు.

కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోరుతూ ప్రచారం

సూర్యాపేట రూరల్ : జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ సర్పంచ్ సూర్యానాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు బాజ్జి, మాతృనాయక్, నాగరాజు, వినోద్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : కోక్యానాయక్‌తండాలో క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ఉపాధి కూలీలను కోరుతున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

పోలింగ్ కేంద్రాల్లో ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాటు

- వైద్యాధికారి సుధాకర్‌నాయక్

మఠంపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సుధాకర్‌నాయక్

మఠంపల్లి, మే 2 : జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ పోలింగ్ కేంద్రంలో ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారి సుధాకర్‌నాయక్ తెలిపారు. కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశానుసారం గురువారం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు వడదెబ్బకు గురికాకుండా వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి జాగ్రత్తలు సూచించాలన్నారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ రవి కుమార్, హెచ్‌వి నాగేంద్రమ్మ, ఫార్మాసిస్ట్ లక్ష్మణ్, సబ్‌సెంటర్ల ఏఎన్ఎంలు చంద్రకళ, పద్మ, నిర్మల, ప్రియాంక, రజిని, సైదమ్మ, రాణి, లోకేశ్వరి, సరిత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలి

చిలుకూరు : ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల విధుల్లో వైద్య సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని డాక్టర్ నవ్య అన్నారు. చిలుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్నికల విధులపై వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. మందుల్లు అందుబాటులో ఉంచుతూ ఓటర్లకు వైద్యపరంగా ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మఠంపల్లి : విద్యార్థినులను అభినందిస్తున్న ఎన్‌సీఎల్ సీనియర్ మేనేజర్ చక్రధర్

పది ఫలితాల్లో ఎన్‌సీఎల్ విద్యార్థినుల ప్రతిభ

మఠంపల్లి, మే 2 : ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ఎన్‌సీఎల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుండు శ్రీహిత, ఆణెపు సాయిసుష్మ 10 జీపీఏ సాధించారు. గురువారం పరిశ్రమ సీనియర్ మేనేజర్ ఎస్.చక్రధర్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ పాఠశాలలో చదవి మండలంలోనే అత్యధిక మార్కులు సాధించడం ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జీఎంహెచ్ఆర్ సతీశ్‌కుమార్, ప్రిన్సిపల్ పూర్ణచందర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన మేడారం, పెంచికల్‌దిన్నె, దిర్శించర్ల, నేరేడుచర్ల, దాచారం, చింతకుంట్ల, మేడారం పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులను గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బట్టు మధు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ప్రకటించాలి'

గరిడేపల్లి, మే 2 : అంగన్‌వాడీ కేంద్రాలకు వెంటనే వేసవి సెలవులను ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటుతున్న ప్రస్తుత పరిస్థితిలో చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, నాయకుడు అంజిరెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం

మఠంపల్లి, మే 2 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఉచిత వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మన్నెం సీతారాంరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ క్రీడాకారుల సహకారంతో నిర్వహించే ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

'ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి'

నూతనకల్, మే 2 : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో టెంట్లు వేయించాలని, మంచినీరు సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికిల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బానాల వెంకట్‌రెడ్డి, చిర్ర రాములు, బానాల లింగారెడ్డి, యానాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అదనపు బీయూల ఎఫ్ఎల్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

అదనపు బీయూలకు ఎఫ్ఎల్‌సీ నిర్వహణ

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, మే 2 : నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో బ్యాలెట్ యూనిట్లను అదనంగా జిల్లాకు తెప్పించి ఎఫ్ఎల్‌సీ నిర్వహించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ పరిధిలోని ఈవీఎంల గోదాం వద్ద జిల్లాకు చేరుకున్న అదనపు బ్యాలెట్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీని ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్.లతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకు అదనంగా 1,200 అదనపు బ్యాలెట్ యూనిట్లు తెప్పించినట్లు చెప్పారు. వాటిని 12 మంది ఈసీఐఎల్ ఇంజినీర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎఫ్ఎల్‌సీ చేపట్టడం జరిగిందని తెలిపారు. ర్యాండమైజేషన్, సెగ్రిగేషన్ అనంతరం నియోజకవర్గాలకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. సూర్యాపేట ఆర్డీఓ వేణుమాదవ్, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సవరాల సత్యనారాయణ, బీఎస్పీ స్టాలిన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి

- సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి పెట్టాలి
- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మే 2 : ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. గురువారం అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేశ్‌మీనాతో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో నల్లగొండ పార్లమెంట్ పరిధి సూర్యాపేట, తుంగతుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధి రూట్ మొబైల్స్ డ్యూటీ, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించి ఎన్నికల విధులపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో రూట్ మొబైల్ విధులు ప్రధానమైనవని తెలిపారు. ఎన్నికల రూట్లలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ముఖ్యంగా ఆ మార్గంలో వచ్చే గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాలు తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం, ఎన్నికల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడం కూడా రూట్ మొబైల్ సిబ్బందికి చాలా ముఖ్యమైనవన్నారు. సమస్యలు వస్తే సంబంధిత అధికారులు, సెక్టార్ అధికారులు, స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ట్రబుల్స్, మాంగర్స్‌ను కట్టడి చేయాలని, అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని, ఓటరును ప్రభావితం చేసేలా, ప్రలోభాలకు గురి చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీలు రవి, మట్టయ్య, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు వీర రాఘవులు, ఎన్నికల సెల్ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, శ్రీను, రఘువీర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎన్నికల సెల్ ఎస్ఐలు, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ ఎస్ఐలు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో మే డే వేడుకలో పాల్గొన్న సృజన

కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం

- మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

చింతలపాలెం, మే 2 : కార్మికుల హక్కులకై నిరంతర పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సోమిరెడ్డి వెంకట్‌రెడ్డి భవన్ నందు ప్రపంచ కార్మిక మే డే దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెస్తున్న నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి, మండల కార్యదర్శి రవి, గ్రామ కార్యదర్శి అంకరాజు, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాగారం, మే 2 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ దారా శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైటింగ్, ఫ్యాన్స్, ఫర్నీచర్, ర్యాంప్, వాటర్, టాయిలెట్స్, శానిటేషన్, వెబ్ క్యాస్టింగ్ కోసం కరెంట్ సాకెట్స్ తదితర అన్ని ఏర్పాట్లు కల్పించే దిశగా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

తిమ్మాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

అర్వపల్లి, మే 2 : మండల పరిధిలోని తిమ్మాపురం, అడివెంలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. సీరియల్ ప్రకారం కాంటాలు వేయాలని సూచించారు. రికార్డులను పరిశీలించి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈఓ సత్యం ఉన్నారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

హుజూర్‌నగర్ రూరల్, మే 2 : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని లింగగిరి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పెనుగొండ శ్రీనివాస్ అన్నారు. గురువారం వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడకారులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీలు బ్రహ్మారెడ్డి, శ్రీదేవి, ప్రదీప్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

హుజూర్‌నగర్ రూరల్, మే 2 : మఠంపల్లి మండలం పెదవీడు గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ రహీం కుమారుడు ఇటీవల ఈతకు వెళ్లి బావిలో పడి చనిపోయాడు. విషయం తెలిసిన లక్కవరం గ్రామానికి చెందిన రహీం బాల్య స్నేహితులు అందరూ కలిసి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

గ్యాస్ లీకై సామగ్రి దగ్ధం

గరిడేపల్లి, మే 2 : గ్యాస్ లీకై మంటలు చెలరేగ